
ఆయుధాలతో తరలివస్తున్న వీరాచారవంతులు


కొత్తగా వేసిన రంగులతో ఉత్సవ కళను సంతరించుకున్న వీరుల గుడి

పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు వీరుల గుడి ప్రాంగణానికి తరలివస్తున్నారు. రణక్షేత్రం పొలిమేరలో తూర్పున ఉన్న కల్లిపోతురాజు మండపం వద్ద పోతురాజుకు కొబ్బరి కాయలు కొట్టి అక్కడ నుంచి వీరుల గుడికి వచ్చారు. ఇదిలా ఉంటే వీరుల గుడికి వెల్లవేసే కార్యక్రమం కొనసాగింది. వీరుల గుడిలో ఉన్న ఆయుధాలను బయట పెట్టి గుడి పూజారులు గుడి మొత్తాన్ని నీటితో శుభ్రం చేశారు. గుడిలో చుట్టూ వీరుల ప్రతి రూపంగా ఉన్న వీర గల్లులను శుద్ధి చేసి పసుపు పూసి పూజకు సిద్ధం చేశారు.

– కారెంపూడి


ఆయుధాలతో వీరాచారవంతులు

క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా' ఒక సువర్ణావకాశం

గురజాల : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా టోర్నమెంట్‌ను నిర్వహిస్తుందని క్రీడాకారులుగా ఎదగాలనుకునే యువతకి ఇది ఒక సువర్ణావకాశమని ఎంపీడీవో ఆర్.ఫణికుమార్ నాయక్ , నగర పంచాయతీ కమిషనర్ ఏ మోహన్‌శ్రీనివాస్‌లు అన్నారు. వారు మంగళవారం మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో క్రీడా టోర్నమెంట్‌కు అవసరమైన క్రీడా పరికరాలు అందించడం జరిగిందన్నారు. 15 ఏళ్లు దాటిన మహిళలు, పురుషులకు వేరుగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ చౌర్యంపై తనిఖీలు



దాచేపల్లి : విద్యుత్‌శాఖ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తులకు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు చెప్పారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 43 మంది అధికారులు 86 మంది సిబ్బందితో బృందాలుగా ఏర్పడి దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో 3,977 సర్వీస్‌లను పరిశీలించి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుతున్న 108 మందికి రూ.5.19లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అధికారులు చెప్పారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎం.రవికుమార్, కె.రవికుమార్, టి.సర్వేశ్వరరావు, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు



పిడుగురాళ్ల: పట్టణంలోని 16వ సచివాలయంకు చెందిన శానటరీ సెక్రటరీ ఆవుల అశోక్, ఇమ్యూనిటీ సెక్రటరీ ఫణీంద్రపై సోమవారం దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని పిడుగురాళ్ల పట్టణంలో సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరారు. సచివాలయ ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే దాడికి పాల్పడిన షేక్ సైదావలిని అదుపులోకి తీసుకొని విచారిస్తామని సీఐ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేసీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మాచర్ల: పట్టణంలోని కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఈఎస్‌ఐ వారు కార్మికులు, సిబ్బందికి కేసీపీ ఆడిటోరియంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 500 మంది ఉద్యోగులు, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరిత, డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ.లక్ష విలువ చేసే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. క్యాంపు కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ ప్రారంభించారు. క్యాంపులో డీజీఎం రామకోటేశ్వరరావు, డాక్టర్ రామకోటయ్య, హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

15న విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

నరసరావుపేట: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 15వ తేదీ ఉదయం 9.30కు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సువార్త మంగళవారం వెల్లడించారు. రన్నింగ్, షార్టుపుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, చెస్ తదితర ఆటల్లో పోటీలు ఉంటాయన్నారు.

ఒలింపియాడ్ పోటీలకు టైనీటాట్స్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: టైనీటాట్స్ పాఠశాల 8వతరగతి విద్యార్థి వై.నీరజ్‌రెడ్డి జాతీయ స్థాయి ఒలంపియాడ్ పోటీ పరీక్షకు ఎంపికైనట్టు పాఠశాల ఏఓ ఎలవర్తి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈనెల 10వతేదీన గుంటూరులో కెన్‌కెన్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి మ్యాథ్స్ పజిల్ పోటీలో నీరజ్‌రెడ్డి కప్పా విభాగంలో కాంస్య పతకం సాధించి ఈనెల 17వతేదీన ముంబైలో జరగనున్న జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్టు వివరించారు. నీరజ్‌రెడ్డిని పాఠశాల డైరెక్టర్ పాతూరి కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ జగనన్నే సీఎం కావాలి


మాచర్లలో అభివృద్ధి, సంక్షేమం వివరాల బోర్డును,రోచర్‌ను ఆవిష్కరించిన నేతలు


సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న నేతలు

ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెల్దుర్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపాడు గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని 87 శాతం గృహాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు రూ.2.40 లక్షల కోట్లను అందించటం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బడుగు బలహీన వర్గాల ప్రజలు మద్దతుగా నిలిచి మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా సచివాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఇవి కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జెడ్పీటీసీ రూప్లీబాలునాయక్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి మేకల కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు, గ్రామసర్పంచ్ తోట నారాయణ, ఉప సర్పంచ్ ఉప్పుతోళ్ల కృష్ణ, మాజీ సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాచర్లలో..

మాచర్ల: మాచర్ల పట్టణంలోని 8వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం కౌన్సిలర్ మందా సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు నవరత్నాలు ద్వారా పలు సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. 300 కుటుంబాలను కలిసి కరపత్రాలు అందించి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సంక్షేమ ఫలాల బోర్డును ఆవిష్కరించారు. వార్డులో ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురకా కిషోర్, అబ్దుల్ జలీల్, వైఎస్సార్‌సీపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు కె.శ్రీను, కౌన్సిలర్లు గురవయ్య, జ్యోతి, జగన్నాధం , శివయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ నేతలు రాజు, దాసు, కోటి, రాము, లాజర్, మల్లికార్జున్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, రవి, బాలమ్మ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సామగ్రి అందజేత


సచివాలయ సిబ్బందికి క్రీడా సామగ్రిని అందజేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్

వెల్దుర్తి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, ఎంపీడీవో డి.ప్రసాద్‌లు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బందికి క్రీడా సామగ్రిని అందజేసి మాట్లాడారు. 15 సంవత్సరాలు నిండి క్రీడలపై మక్కువ ఉన్న వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 15 నుంచి క్రీడా పోటీలు సచివాలయాల పరిధిలో జరుగుతాయన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు ఐదు రకాల క్రీడా సామగ్రిని అందజేయటం జరిగిందన్నారు. గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాన్ని వెలికి తీయటానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడాకారులలో నైపుణ్యాన్ని వెలికితీసి మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు ఉన్నత స్థానానికి ఎదిగేలా ఈ క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజశేఖర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి నాగిరెడ్డి, సర్దార్‌నాయక్, తోట నారాయణ, దిబ్బా సియోను, తోట ఆంజనేయులు, మందా సీతారామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరమేశ్వరునికి అన్నాభిషేకం


సత్రశాల దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేస్తున్న చైర్మన్ బ్రహ్మారెడ్డి, అన్నదాతలు

సత్రశాల(రెంటచింతల): కైలాసనాథుడైన శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం చివరిరోజు మంగళవారం అతిపురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాగణం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. స్వామివారికి చేసిన అన్నాభిషేకం నిర్వహించారు. వేకువ జామునుంచే భక్తులు కార్తీక పుణ్యస్నానాలు చేసి, దీపాలు వెలిగించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పాలువాయి జంక్షన్ శ్రీనివాస నర్సరీ నిర్వాహకులు శౌంఠిరెడ్డి గురువారెడ్డి, వెన్నా శ్రీనివాస రెడ్డి, గుంటా నరేంద్రారెడ్డి భక్తులకు, మాలధారులకు అన్నదానం చేశారు. దేవస్థానం ఈవో బుర్రి నెమలి రెడ్డి, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై అవగాహన


మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై అవగాహన సమావేశం దృశ్యం

అమరావతి: మండల పరిధిలోని 14వ మైలు వీసస్ హైస్కూల్‌లో మంగళవారం మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై బాలబాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సమావేశంలో నేర విభాగం ఎస్ఐ అల్లూ రెడ్డి బాలబాలికల అక్రమ నిరోధక చట్టం, రాగింగ్, మత్తు పదార్థాలు బానిసత్వం వాటి దుష్పరిణామాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక నిరోధక చట్టం గురించి వివరించారు. అలాగే చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కి వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేర విభాగం సిబ్బంది మంగమ్మ, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ నల్లూరి సాంబశివరావు హెచ్ఎం రాధాకష్ణ, అకడమిక్ డైరెక్టర్ త్రివేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



రెంటచింతల: ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక పోస్టల్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొని పోస్టల్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలని, 8 గంటల పని భారం కల్పించాలని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్‌లు వెంటనే మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని, కమలేష్ చంద్రకమిటీ సిఫార్స్ చేసిన బంచింగ్ అమలు చేయాలని, 7వ వేతన కమిటీలో జీడీఎస్‌లకు అమలుకాని అంశాలను అమలుచేయాలని, టార్గెట్స్, మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేధింపులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పోస్టల్ ఉద్యోగులు మస్తాన్‌వలి, అమర నాగేశ్వరరావు, శివనారాయణ, రాజశేఖర్, మౌలాలి, సైదారావు, సుధారాణి, సౌజన్య, వేణుగోపాల్‌రెడ్డి, నవీన్, మంత్రూనాయక్, సోమ్లానాయక్, ప్రసాద్ తదితరులున్నారు.

గ్రామీణ తపాలా సిబ్బంది సమ్మె

గురజాల : గ్రామీణ తపాలా శాఖ సిబ్బంది వారి డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్రాంచి పోస్టుమాస్టర్ రామమూర్తి మాట్లాడుతూ 8 గంటల పనిభారం కల్పించాలని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్సు రూ.5 లక్షలకు పెంచాలని, కుటుంబ సభ్యులతో సహా వైద్య సేవలు అందించాలని పలు డిమాండ్‌లను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైదారావు, ఎం.ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్ ఆకస్మిక తనిఖీ


కండక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఆర్టీసీ సీఎంఈ శ్రీనివాసరావు, డీఎం జీఎస్‌వీవీ కుమార్

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజిలో జోన్-3 డిప్యూటీ సీఎంఈ ఎస్.శ్రీనివాసరావు ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా గ్యారేజిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజి సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అనంతరం తిరుపతిలో ఇటీవల జరిగిన 42వ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పట్టణంలోని ఆర్టీసీ డిపో కండక్టర్ జి.శ్రీనివాసరెడ్డి పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకుని ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ చూపిన కండక్టర్ శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా సీఎంఈ శ్రీనివాసరావు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్, గ్యారేజ్, డిపో సిబ్బంది, ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

డీఎంఅండ్‌హెచ్‌వో


బొల్లాపల్లి వైద్యశాలలో ఆశాకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో

బొల్లాపల్లి: విధి నిర్వహణలో శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి బి. రవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆశ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్యసేవలు గురించి ఆశ కార్యకర్తల నుంచి వివరాలు సేకరించారు. వారికిపలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని, ఎవరి విధులు వారు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. వైద్య సేవల గురించి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం. సాయి వినూత్న, స్టాఫ్ నర్సులు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దు


మాట్లాడుతున్న విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ సీఎల్ రామరాజు

అమరావతి: రైతులు పురుగు మందుల వినియోగంలో పూర్తి అవగాహన లేకపోవడం వల్ల, ఒక్కొక్కసారి మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేయడంతో పంట దిగుబడి తగ్గిపోతోందని విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ సీఎల్ రామరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్లాది గ్రామంలో విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పురుగుమందుల వాడకం, పిచికారీ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రామరాజు రైతులకు అవగాహన కల్పిస్తూ పురుగు మందుల వినియోగం, పిచికారీ చేసేటప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నమ్మకమైన, ప్రభుత్వం సిఫార్సు చేసిన కంపెనీలకు చెందిన పురుగు మందులనే కొనుగోలు చేయాలని, అవసరం మేరకే మందులు పిచికారీ చేయాలన్నారు. మోతాదుకు మించి మందులు వినియోగిస్తే పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. గాలి వీచే దిశలోనే పిచికారీ చేయాలి. ప్యాకింగ్‌తో ఉన్న పురుగు మందులనే కొనుగోలు చేయాలి. పిచికారీ చేసేటప్పుడు ముఖాలకు మాస్కులు ధరించాలన్నారు.

ముగిసిన కార్తిక మాసం


విప్పర్ల శివాలయంలో లింగాకారంలో దీపోత్సవం


యడ్లపాడు బ్రహ్మంగారి గుడిలో దీపార్చన

యడ్లపాడు: కార్తిక అమావాస్య సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సొలస గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయం, శ్రీభూసమేత రంగనా యకస్వామి దేవస్థానంలో కార్తిక మాసం చివరిరోజు సందర్భంగా మహాశివునికి ప్రత్యేక అలంకరణ చేసి దీపార్చన చేశారు. ఆయా ప్రాంగణంలో రంగవల్లులు, రంగురంగుల పూలు వివిధ ఆకారాల్లో ఏర్పాటు చేసి వాటి మధ్య దీపాలను అలంకరించి పూజలు నిర్వహించారు.

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఆగాబావి బజారులో గల శ్రీ రామాలయంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. నాలుగు వేల ఒత్తులతో దీపార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని శివనామాన్ని పఠించారు. ప్రముఖ చిత్రకారుడు ప్రసాద్ రూపకల్పనలో శివలింగాకారాన్ని తయారు చేయడం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ సమర్థ సద్గురు షిరిడీసాయిబాబా మందిరంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని 6 వేల ప్రమిదలతో ఆరు కోట్ల ఒత్తులతో దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పోతుకూచి వెంకట శ్రీనివాసశర్మ, ఆలయ అధ్యక్షులు ప్రసాదరావు, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి వాసవీ కన్యకా పరమేశ్వరి సహిత కోదండ రామాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కార్తిక మాస పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ నెల 10న ప్రారంభమైన పూజల్లో భాగంగా భవానీశంకర స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజార్లు దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్తిక మాస పూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

రొంపిచర్ల: మండలంలోని శివాలయాలన్ని సోమవారం రాత్రి భక్తులతో పోటెత్తాయి. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావటంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. ఉపవాసాలు ఉండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దీపోత్సవాలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

ద్విచక్ర వాహనాల వేలం

రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో మూడు వాహనాలకు రూ.53,725 రూపాయలు వెచ్చించి పాటదారులు పాడుకున్నారు. వేలంలో వాహనాలను పాడుకున్న వారికి వాటిని స్వాధీనం చేశారు. వేలం పాట కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ పి.వి. రవీంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు, నూజెండ్లపల్లి మండలం, కొత్తనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీనివాసరావు, భార్య రమణ, కుమారుడు మోహన్‌అభిమన్యు ఈ నెల 10న వ్యక్తిగత పనులపై గుంటూరు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి.

16న చౌక్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల రాష్ట్ర జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఎంపిక ఉంటుందని ఒక ప్రకటనలో వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీ డాకారులు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9885408317 నంబర్ సంప్రదించాలన్నారు.

తప్పులు..తలనొప్పులు లేకుండా చూడండి..


సమీక్షలో మాట్లాడుతున్న ఈఆర్‌వో జి వసంతబాబు

యడ్లపాడు: చిన్నపాటి తప్పు లేకుండా కచ్చితమైన వివరాలతో కూడిన ఓటర్ల జాబితాను రూపొందించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.వసంతబాబు చెప్పారు. స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై తహసీల్దార్ వైవీబీ కుటుంబరావుతో కలిసి బీఎల్‌వోలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రతి ఎన్నికల కమిషన్ పరిశీలిస్తుందని అందరూ జాగ్రత్తగా వహించాలని చెప్పారు. పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జాబితాలో తప్పులు దొర్లితే ఈఆర్వోలే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొత్త ఓట్లపై చైతన్యం కలిగించి యువ ఓటర్లకు అవకాశం కల్పించాలని తెలిపారు. సమావేశంలో బీఎల్‌వోలతో పాటు ఎన్నికల సూపర్‌వైజర్లు హాజరయ్యారు.